# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 26 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4



## అఫ్ఘాన్‌పై పాక్ వైమానిక దాడులు..

- 46 మంది మృతి



**బలగం టీవీ, హైదరాబాద్**

అఫ్ఘానిస్థాన్‌పై పాకిస్థాన్ చేసిన వైమానిక దాడుల్లో మృతుల సంఖ్య 46 కు చేరినట్టు తాలిబన్ ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని తెలిపింది. ఈ దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. తూర్పు పక్తికా ప్రావిన్స్ లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా వైమానిక దాడులు జరిగాయి. ఇందులో 46 మంది చనిపోగా, మరో ఆరుగురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. ఈ దాడులను అనాగరిక చర్యగా తాలిబన్ రక్షణ శాఖ పేర్కొంది. వీటికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించింది. ఈ దాడుల్లో వజీరిస్థానీ శరణార్థులే ఎక్కువగా మరణించినట్టు సమాచారం.



## మెదక్ చర్చికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

- ఇందిరమ్మ ఇండ్లు దళిత, గిరిజన క్రిస్టియన్లకు అత్యధికం
- పీసీసీ ప్రెసిడెంట్‌గా వచ్చినప్పుడే చెప్పా.. సీఎం హోదాలో వస్తానని
- సీఎం రేవంత్‌రెడ్డి
- రూ.750 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఏడుపాయలలో ప్రత్యేక పూజలు..మెదక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

**బలగం టీవీ, మెదక్**

క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు విజ్ఞప్తి మేరకు మెదక్ చర్చి అభివృద్ధికి నిధులు కేటాయించామని చెప్పారు. వందేళ్ల పూర్తి చేసుకున్న మెదక్ చర్చికి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. "పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇక్కడికి వచ్చాను. ఆ సమయంలో సీఎం హోదాలో మళ్లీ వస్తానని మాటిచ్చాను. ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది," అని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. క్రిస్మస్ సందర్భంగా ప్రజలందరితో కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లలో దళితులు, గిరిజన క్రైస్తవులకు అధిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. అలాగే ఆరోగ్యశ్రీ సాయం రూ.10 లక్షలకు పెంచామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు.

చర్చిని సందర్శించడానికి ముందు సీఎం రేవంత్ రెడ్డి మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

**వనదుర్గామాత ఆలయంలో...**

కాగా.. మెదక్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా పాపన్నపేట మండలంలోని ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ రఘునందన్ రావు తదితరులు వన దుర్గాదేవిని దర్శించుకున్నారు.

దయం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మెదక్ చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడ ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మెదక్ చర్చికి చేరుకున్నారు. అక్కడ చర్చి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆపై అక్కడ నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో సేంద్రియ సేద్యం చేపట్టి చరిత్ర సృష్టించారు

- త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశాభివృద్ధి
- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్
- సేంద్రీయ సాగు రైతులతో ఉప రాష్ట్రపతి ఆత్మీయ సమ్మేళనం
- కౌడిపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రంలో గవర్నర్, రాష్ట్రమంత్రితో కలిసి పర్యటన



**బలగం టీవీ, హైదరాబాద్**

మెదక్ జిల్లాలో 655 మంది రైతు కుటుంబాలు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలోనే చరిత్ర సృష్టించారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు.వారంతా మూడు రోజుల పాటు ఢిల్లీకి రావాలని కోరారు. ఊరు చిన్నది అయినా తనకు మార్గదర్శక మన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి, సేంద్రియ రైతు సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తునికిలోని కిషి విజ్ఞాన కేంద్రానికి హెలికాప్టర్ ద్వారా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి డాక్టర్ సుదేశ్ ధన్కర్ చేరుకున్నారు. ఆయనతో పాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఉన్నారు. మొదట విజ్ఞాన కేంద్రంలో మొక్క నాటి అక్కడే ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులకు సంబంధించిన స్టాల్స్‌ను ఉపరాష్ట్రపతి పరిశీలించారు. అనంతరం కేవికేలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయ సాగుపై దాదాపు 800 మంది రైతులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడారు. మెదక్ జిల్లాలో సేంద్రియ వ్యవసాయం చేసిన రైతులు, గ్రామపంచాయతీ సభ్యులు తనకు ప్రత్యేక అతిథులని, వారికి ఢిల్లీలో ఆతిథ్యం ఇస్తానన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వికాసానికి లాల్ బహదూర్ శాస్త్రి, జైజవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదంతో వాజ్‌పేయి, జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసందాన్ నినాదంతో ప్రధాని మోడీ కృషి చేస్తున్నారన్నారు.

**త్వరలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్**

రాబోయే కొద్ది కాలంలోనే భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించబోతుందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఆశాభావం వ్యక్తం చేశారు. 2001లో అప్పటి ప్రధాని వాజ్ పేయి నేతృత్వంలో కిసాన్ దివస్‌ను ప్రకటించారు. అది త్వరలో రజతోత్సవం జరుపుకోబోతుందన్నారు. దేశంలోని 730 పై చిలుకు కృషి విజ్ఞాన కేంద్రాలు, 150 పై చిలుకు ఐకార్ సంస్థలు ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశ పురోభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోని ఇంధన, సహజ వనరులను అవసరం మేరకే వినియోగించుకోవాల న్నారు. గ్రామీణ వ్యవస్థలో తమ గ్రామాల్లో పండించిన పండ్లు, కూరగాయలను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకుని అక్కడే వినియోగించుకోవాలన్నా రు. దేశంలో అనేకమంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉన్నా అనుకున్న విధంగా సాగులో మార్పులు రావడం లేదన్నారు. దేశంలో దాదాపు 10 కోట్ల మం ది రైతులు ఉన్నారని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ ఫలాలు రైతులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యతను మరవద్దన్నారు. ప్రభుత్వం విద్యుత్ సబ్సి డీలపై ఆధారపడకుండా సోలార్ ఎనర్జీపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులతో చర్చించి, వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ఆర్గానిక్ సాగు చేస్తున్న 800 మంది రైతులు ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రైతులు ఆర్గానిక్ సాగు దిశగా అడుగులు వేయడం బాగుందన్నారు. ఏకలవ్య కేవికె సంస్థ ఆర్గానిక్ సాగు దిశలో రైతులకు మేలైన సహకారం అందిస్తుండడం పట్ల అభినందించారు. రాబోయే రోజుల్లో మరింత సేంద్రియ సాగు విస్తృత పరిచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## రాబోయే రెండు రోజుల్లో మోస్తారు వర్షాలు..!

- బంగాళాఖాతంలో కొనసాగుతోన్న తీవ్ర అల్పపీడనం

**బలగం టీవీ, హైదరాబాద్**



బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావం తెలంగాణపై కూడా చూపనుంది. దీంతో రానున్న రెండు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో బుధవారం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వర్షం కురిసింది. ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల చిరు జల్లులు కురిశాయి. నల్లగొండ జిల్లా మాటూరులో 1.1 సెం.మీ, భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా ఇల్లందులో 1.1 సెం.మీ వర్షం కురిసింది. వాతావరణ శాఖ అంచనాలకు భిన్నంగా బంగాళాఖాతంలో అల్పపీడనం కదులుతోంది. ప్రస్తుతం దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు సమీపాన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ నైరుతిగా పయనించి దక్షిణ కోస్తా తీరం వైపు క్రమంలో బలహీనపడుతుందని అంచనాలు ఉన్నాయి. ఇక, తీవ్ర అల్పపీడనం కారణంతో బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులకు పైగా వదలకుండా, విడవకుండా ఉన్న ముసురు రైతులకు ముప్పుగా మారింది.



## కజకిస్థాన్‌లో కుప్పకూలిన విమానం

- 38 మంది మృతి

**బలగం టీవీ, బాకు**

కజకిస్థాన్ లో ఘోర ప్రమాదం జరిగింది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ ప్రయాణికుల విమానం అక్టౌ సమీపంలో కుప్పకూలిపోయింది.ఈ ప్రమాదంలో 38 మంది చనిపోయినట్టు అధికారవర్గాలు తెలిపాయి. ప్రమాద సమయంలో విమానంలో 67 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో కలిపి మొత్తం 72 మంది ఉన్నారు. వీరిలో 29 మందిని ప్రాణాలతో బయటపడినట్టు కజకిస్థాన్ ఆరోగ్య శాఖ మంత్రి వెల్లడించారు.అజర్‌బైజాన్‌లోని బాకు నుంచి బయల్దేరిన ప్రయాణికుల విమానం రష్యా రిపబ్లిక్ చెచెన్యా రాజధాని గ్రోజ్నీ వైపు వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. గ్రోజ్నీలోని దట్టమైన మంచు కారణంగా దానిని దారి మళ్లించారు. ఈ క్రమంలోనే అక్టౌ ఎయిర్ పోర్ట్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దాంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదానికి ముందు ఎయిర్‌పోర్ట్‌పైన విమానం పలుమార్లు గిరగిరా తిరిగి, నేల కూలిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ దృశ్యాలు నెట్టింట్లో వెలుగులోకి వచ్చాయి. అయితే ఈ ప్రమాదానికి పక్షి కారణమన్న కథనాలు వస్తున్నాయి.



## ప్రత్యేక నాణెం విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

దివంగత ప్రధాని, భారత రత్న అటల్ బిహారి వాజ్‌పేయీ 100వ జయంతి సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. వాజ్‌పేయీ వందవ జయంతి సందర్భంగా రూ.100 స్మారక నాణేన్ని రిలీజ్ చేశారు. అంతేకాకుండా స్టాంప్‌ను కూడా మోదీ విడుదల చేశారు. మరోవైపు వాజ్‌పేయి 100వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని సదైవ్ అటల్ స్మారకం వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌కడ్, స్పీకర్ ఓం బిర్లా , ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, హెచ్‌డీ కుమార స్వామి ఇతర కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఏపీ సీఎం చంద్రబాబు సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ , బీజేపీ నేతలు వాజ్‌పేయికి నివాళి అర్పించారు.

## గోవాలో పర్యాటక బోటు బోల్తా.. ఒకరు మృతి



**బలగం టీవీ, హైదరాబాద్**

గోవాలో విషాదం చోటుచేసుకుంది. నార్త్ గోవాలోని కాలంగుటె బీచ్ అరేబియన్ సముద్రంలో పర్యాటకుల పడవ బోల్తా పడి ఒకరు మరణించారు. మరో 20 మందిని రెస్క్యూ టీమ్ కాపాడింది. మరణించిన వ్యక్తిని 54 ఏళ్ల వ్యక్తిగా గుర్తించారు. పడవ ప్రమాదంలో రక్షించిన 20 మందిని సమీప ఆసుపత్రికి తరలించామని, ప్రయాణికుల్లో ఇద్దరు మినహా పిల్లా పెద్దలందరూ లైఫ్ జాకెట్లు వేసుకున్నట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. తీర ప్రాంతానికి సుమారు 60 మీటర్ల దూరంలో పడవ బోల్తాపడిందని, దీంతో అందరూ సముద్రంలో పడిపోయారని లైఫ్ సేవింగ్ ఏజెన్సీ దృష్టి మెరైన్ ప్రతినిధి ఒకరు తెలిపారు. పడవలోని 13 మంది మహారాష్ట్రలోని ఖేడ్ నుంచి వచ్చారని, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని వివరించారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే విధి నిర్వహణలో ఉన్న 18 మంది లైఫ్ సేవర్లు ప్రయాణికులను కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారని, వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి కొందరిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామని చెప్పారు.. ఈ ప్రమాదం బుధవారం మధ్యాహ్నం 1:30 గంటలకు జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

## దాన కిషోర్ వాంగ్మూలం నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నమోదు చేశారు. గతంలో ఫార్ములా–ఈ కార్ రేసింగ్ నిర్వహణకు సంబంధించి హెచ్ఎండీఏకు చెందిన ఐఓబీ ఖాతా నుంచి రూ.54.88 కోట్లను ఎఫ్ఈఓ విదేశీ కంపెనీకి బదిలీ చేశారంటూ ఇందులో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందని దాన కిషోర్.. ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా ఈనెల 19న గత ప్రభుత్వంలోని మునిసిపల్ వ్యవహారాల మంత్రి కేటీఆర్, అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్, హెచ్ఎండీఏ సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిల పైన ఏసీబీ అధికారులు నాలుగు సెక్షన్ల కింద కేసులను నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, కేటీఆర్‌ను ఈనెల 30 వరకు అరెస్టు చేయరాదంటూ ఈనెల 20న హైకోర్టు.. ఏసీబీకి ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో, దర్యాప్తును కొనసాగించటానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో, తాజాగా దాన కిషోర్ నుంచి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. దాని ఆధారంగా ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా పేర్కొనబడిన కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అరవింద్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు ఒకట్రెండ్రోజులలో నోటీసులు జారీ చేసి వారిని విచారించటానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు, ఈ కేసులో ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేటీఆర్‌పై పీఎంఎల్ఏతో పాటు ఫెమా ఉల్లంఘనల కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. తాము కూడా ఇందులో పేర్కొనబడిన నిందితులను విచారించటానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.



## శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల పరిహారం

**బలగం టీవీ, హైదరాబాద్**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన దుర్ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు పుష్ప–2 చిత్ర బృందం 2 కోట్ల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. అల్లు అర్జున్ కోటి రూపాయలు, దర్శకుడు సుకుమార్ రూ.50 లక్షలతోపాటు నిర్మాతలు రూ.50 లక్షల రూపాయలను రేవతి కుటుంబానికి ఇస్తున్నట్లు అల్లు అరవింద్ వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత చెక్కులను అల్లు అరవింద్ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజుకు అందజేశారు. మరోవైపు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమవుతున్నట్లు దిల్ రాజు ప్రకటించారు.

కిమ్స్ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని మరోసారి కలిసిన ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు, నిర్మాత అల్లు అరవింద్‌లు 20 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌తో మాట్లాడి పుష్ప చిత్ర బృందం తరపున అందించే ఆర్థిక సాయన్ని గురించి దిల్ రాజు వివరించారు. అనంతరం మీడియా సమక్షంలో పరిహారం వివరాలను వెల్లడించిన అల్లు అరవింద్ రేవతి కుటుంబానికి 2 కోట్ల రూపాయలు ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. అందులో అల్లు అర్జున్ తరపున కోటి రూపాయలు, దర్శకుడు సుకుమార్ తరపున రూ.50 లక్షలు, మైత్రీ మూవీస్ నిర్మాతలు రవిశంకర్, నవీన్‌ల తరపున రూ.50 లక్షలు ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే మైత్రీ మూవీస్ నిర్మాతలు మంత్రి కోమటిరెడ్డి సమక్షంలో 50 లక్షల రూపాయల చెక్‌ను శ్రీతేజ్ తండ్రి భాస్కంకు అందించారు. మిగతా కోటి 50 లక్షల రూపాయల చెక్కులను తమ న్యాయవాది సలహా మేరకు ఎఫ్?డీసీ ఛైర్మన్ దిల్? రాజుకు అందిస్తున్నట్లు అల్లు అరవింద్ తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖుల భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో గురువారం టాలీవుడ్ ప్రముఖులు సమావేశం కానున్నారు. గురువారం ఉదయం 10.00 గంటలకు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ ప్రముఖులు సమావేశం కానున్నారు. టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజుతోపాటు పలువురు నిర్మాతలు, దర్శకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఇక ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహా తదితరులు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా సినిమా పరిశ్రమల సమస్యలే ఎజెండాపైనే చర్చ జరగనుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కానీ అల్లు అర్జున్ ఎపిసోడ్ నేపథ్యంలో ఈ భేటీపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసు, రాధా కిషన్‌రావుకు బెయిల్

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో కీలక నిందితుడు తప్ప, అందర్నీ అధికారులు విచారిం చారు. లేటెస్ట్‌గా మాజీ డీసీపీ రాధా కిషన్‌రావుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది న్యాయస్థానం. రాధా కిషన్‌రావు మామ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నాలుగురోజుల పాటు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు ఇచ్చింది. మధ్యంతర బెయిల్ ఇచ్చే క్రమంలో పలు సూచనలు చేసింది న్యాయస్థానం. వర్ధంతి కార్యక్రమం జరిగే ప్రదేశానికి ఎస్కార్ట్‌తో తీసుకెళ్లనున్నారు పోలీసులు. ఎలాంటి ఫోన్ ఉపయోగించరాదని పేర్కొంది. దీన్ని పర్యవేక్షించాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. ప్రయాణ ఖర్చులు, ఎస్కార్ట్ ఛార్జీలు రాధా కిషన్ రావు భరించాలన్నది మరో షరతు. తిరిగి శనివారం సాయంత్రం ఆయన జైలుకు వెళ్లనున్నారు.

అంతకుముందు ఈ కేసుకు సంబంధించి శ్రవణ్‌రావు బెయిల్ పిటిషన్ సందర్భంగా పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి నలుగురు నిందితులతో బేగంపేట్ ఎస్ఐబీ ఆఫీసులో ఏ–6 నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు సమావేశం నిర్వహించినట్టు పేర్కొంది.

ప్రస్తుతం అమెరికాలో ఉన్న ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును ఇండియాను రప్పించేందుకు అధికారులు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడి నుంచి రాకుండా ఆయన ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నారు. ఓ వైపు గ్రీన్ కార్డు సంపాదించుకున్న ఆయన, మరోవైపు తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని యూఎస్ ప్రభుత్వానికి అప్లై చేశారు. కొత్త ప్రభుత్వం ఆయన దరఖాస్తుపై క్లారిటీ ఇవ్వనుంది.

### ఏడుపాయల వనదుర్గామాతను

# దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

మెదక్ జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల శ్రీవనదుర్గాభవాని మాత అమ్మ వారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగాప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా ఏడుపాయలకు చేరుకున్న సిఎంకు స్థానిక ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్‌కుమార్‌రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఇఒ చంద్రశేఖర్ సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. తదుపరి స్థానిక ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్‌రావు, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్,మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, మాజీ ఎంఎల్ఎలు హనుమంతరావు, మదన్‌రెడ్డి తదితరులతో కలిసి ఏడుపాయల ఆలయ అభివృద్ధికి రూ.35 కోట్లు ఏడుపాయల నుంచి కమాన్ వరకు 7 కిలోమీటర్లకు ఫోర్‌లైన్ రోడ్డు, డివైడర్స్, హైమాస్ట్ స్ట్రీట్ లైట్స్‌లకు శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణానికి రూ.5 కోట్ల చెక్కును అందించారు. ఎస్‌టి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నిధులు కింద రోడ్ల నిర్మాణానికి రూ.52 కోట్ల 76 లక్షలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రోడ్డు మార్గంలో మెదక్ చర్చికి చేరుకున్నారు. సిఎం రాకతో ఏడుపాయల దుర్గ అమ్మవారి ప్రాంతాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులతో ఏడుపాయల క్షేత్రం కిక్కిరిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు నాయకులు, ప్రజలు ఉత్సాహం చూపారు.

స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఏడుపాయల ఆలయ అభివృద్ధికి, మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యలకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి సురేష్‌శెట్కార్, ఎంఎల్ఎలు లక్ష్మీకాంతారావు, సంజీవరావు, జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, నీలం మధు ముదిరాజ్, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ సంగీత, ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు



# పబ్లిక్ నోటీసులు.. బీజేపీ కుట్ర




- ఢిల్లీ సీఎం అతిషి

బలగం టీవీ, హైదరాబాద్

పత్రికల్లో వచ్చిన పబ్లిక్ నోటీసులు తప్పుడువని, అదంతా బీజేపీ కుట్ర అని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి అన్నారు. ఆప్ ప్రభుత్వాన్ని బ్లేమ్ చేయడం కోసం బీజేపీ నేతలు కొంతమంది అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆ పబ్లిక్ నోటీస్‌లు వచ్చేలా చేశారని ఆమె ఆరోపించారు. మహిళా సమ్మాన్ యోజన, వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని యోజన పథకాలను నోటిఫై చేయలేదని ఇవాళ ఢిల్లీ ప్రభుత్వం పబ్లిక్ నోటీస్ రిలీజ్ చేసింది. ఆ నోటీస్ ఢిల్లీలోని అన్ని ప్రధాన పత్రికల్లో అచ్చుయ్యింది. దాంతో ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇచ్చిన కేజ్రీవాల్.. ఇప్పుడు వాటిని తుంగలో తొక్కుతున్నారని, మహిళా సమ్మాన్ యోజన పథకాన్ని నోటిఫై చేయలేదని ఆప్ సర్కారు పబ్లిక్ నోటీస్ ఇవ్వడం ద్వారా ప్రజలకు ఇచ్చిన మాట తప్పిందని బీజేపీ నేతలు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై ఢిల్లీ సీఎం అతిషి స్పందించారు.

'ఇవాళ వార్తా పత్రికల్లో అచ్చయిన పబ్లిక్ నోటీస్‌లు తప్పుడువి. బీజేపీ నేతల ఒత్తిడి మేరకు ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఆ నోటీస్‌లు ఇచ్చారు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ తప్పుడు నోటీస్ ఇచ్చిన అధికారులపై పాలనా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారు. మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలు ఇప్పటికే ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాయి. వాటిని కచ్చితంగా అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం అతిషి హామీ ఇచ్చారు.

## తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే కఠిన చర్యలు

బలగం టీవీ, హైదరాబాద్

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై హైదరాబాద్ నగర పోలీసులు మరోసారి ప్రకటన రిలీజ్ చేశారు. సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ప్రజలను అపోహలకు గురి చేసేలా వీడియోలు పోస్టు చేయవద్దన్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన పై సోషల్ మీడియాలో ఎవరైనా తప్పుడు సమాచారం, ప్రజలను అపోహలకు గురి చేసేలా వీడియోలు పోస్టు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్టు కొందరు తప్పుడు వీడియోలు పోస్టు చేసిన అంశం పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటన పై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసు శాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచింది. అయినా కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అల్లు అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్టు క్రియేట్ చేసిన కొన్ని వీడియోలను సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా పోస్టులు చేసిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఇలాంటి ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంలో పోలీసు శాఖను బద్నాం చేసేలా తప్పుడు ప్రచారం చేస్తే సీరియస్‌గా పరిగణిస్తామన్నారు. ఒక అమాయకురాలు మరణం, ఒక పిల్లవాడి ప్రాణానికి ప్రమాదం సంభవించిన ఈ కేసులో పోలీసు శాఖ ఎంతో నిబద్ధతతో విచారణ జరుపుతోందని తెలిపింది. దానిని ప్రశ్నించేలా అసత్య ప్రచారాలు, అభూతకల్పనలతో సోషల్ మీడియా ద్వారా ఎవరైనా ప్రచారం చేస్తే సహించేది లేదని పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించి ఏ పౌరుడి దగ్గరైనా ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే పోలీసు శాఖకు అందించవచ్చని సూచించింది. కానీ, సొంత వ్యాఖ్యానాలు చేయవద్దని పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రకటించింది. సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు..

# కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రతిపాదిస్తున్న ప్రభుత్వం



- జనవరి 3న తెలంగాణ గ్రీన్ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ పాలసీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

బలగం టీవీ, హైదరాబాద్

హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్ష్యాన్ని అందుకోవడానికి, తెలంగాణ ప్రభుత్వం కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రతిపాదిస్తుందని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటని, వివిధ రంగాలలో విస్తరించి ఉన్న విభిన్న ఆర్థిక వ్యవస్థను కలిగి ఉందన్నారు. రాష్ట్రం చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యాక్రమాల వలన, తెలంగాణ గరిష్ట విద్యుత్ డిమాండ్ 2023 –24లో 15,623 మెగావాట్ల నుండి 2027– 28లో 20,968 మెగావాట్లకు, 2034 –35లో 31,809 మెగావాట్లకు పెరుగుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ అవసరాలు 2023 –24లో 85,644 మిలియన్ యూనిట్ల నుండి 2027 –28 లో 1,15,347 మిలియన్ యూనిట్లకు, 2034– 35లో 1,50,040 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం 2030 నాటికి స్వచ్ఛమైన, స్థిరమైన 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నదని తెలిపారు. హరిత ఇంధనానికి పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి, జాతీయ స్థాయిలో పెట్టుకున్న లక్షాన్ని అందుకోవడానికి గాను 2025 జనవరి 3వతేదీ ఉదయం 11 గంటలకు మాదాపూర్‌లోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో భాగస్వాములతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ ,విదేశాల నుండి ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

## 'మహిళలను నమ్మించి మోసం చేసిన ప్రభుత్వం'

బలగం టీవీ, హైదరాబాద్

రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలను నమ్మించి మోసం చేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో క్రిస్మస్ గిఫ్ట్, రంజాన్ తోఫా, బతుకమ్మ చీరల పంపిణీ ఎగిరిపోయాయని ఆమె ఎద్దేవా చేశారు. మెదక్ చర్చిని సందర్శించిన అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని సీఎం ప్రకటిస్తారని మహిళలకు ఆశించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటన చేస్తారని ఊహించారు. కానీ ప్రభుత్వం ఎటువంటి ఆలోచన చేయడం లేదు. రాష్ట్రంలోని ఒక్కో ఆడబిడ్డకు ప్రభుత్వం రూ. 30 వేలు బాకీ పడింది. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇవ్వలేదు. రాష్ట్రంలో 40 శాతం నేరాలు పెరిగాయి. నేరాల పెరుగుదల.. ప్రభుత్వం మహిళల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసే సోయి ప్రభుత్వానికి లేదు. మహిళలు చూస్తూ ఊరుకోబోరు.. కచ్చితంగా ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును ఎగ్గొట్టింది. తక్షణమే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలి. రైతు భరోసా కింద అర్హులను తగ్గించే ప్రయత్నం చేయవద్దు. కేంద్ర ప్రభుత్వపు నిబంధలను అమలు చేస్తే 30 శాతం రైతులకు కూడా రైతు భరోసా రాదని కవిత పేర్కొన్నారు. మొక్కజొన్నలు, కందులు, సోయాబీన్, పత్తి వంటి పంటలను మద్ధతు ధరను పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైంది..? ఏడాది కాలంగా ఏ ఒక్క పంటకు మద్ధతు ధర ఇవ్వడం లేదు. చక్కెర ఫ్యాక్టరీలను ఎప్పుడు ఓపెన్ చేస్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రేషన్ కార్డులు ఇవ్వలేదుతక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## ఎన్నికల నిబంధనల సవరణలపై సుప్రీంకోర్టుకు కాంగ్రెస్

బలగం టీవీ, న్యూఢిల్లీ

ఎన్నికల నిర్వహణా నిబంధనలు 1961కి సవరణలు చేయడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును కాంగ్రెస్ పార్టీ ఆశ్రయించింది. మంగళవారం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను పార్టీ నాయకులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ పిటిషన్ వేశారు. ఎన్నికల నిర్వహణా నిబంధనలు 1961లోని రూల్ 93లోని సబ్–రూల్ (2)ను సవరించినట్టు ఈ నెల 20న కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. గతంలో ఈ రూల్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన పత్రాలను ఎలాంటి మినహాయింపు లేకుండా అనుమతి ఇచ్చారు. అయితే తాజాగా ఈ రూల్‌ను ఎన్నికల పోలింగ్ బూత్‌ల్లో సీసీటీవీ కెమెరా ఫుటేజు, వీడియో రికార్డింగులను, ఎన్నికలకు సంబంధించిన రికార్డులను పరిశీలించేందుకు ప్రజలకు గల హక్కును నియంత్రిస్తూ ఈ సవరణలు తీసుకువచ్చారు. ఒక అభ్యర్థికి పోలింగ్ బూత్‌ల సీసీటీవీ కెమెరా ఫుటేజు, వీడియో రికార్డింగులను అందచేయాలని ఇటీవల పంజాబ్–హర్యానా హైకోర్టు ఆదేశించిన తరువాత ఈ సవరణలు చేశారు.

# హైందవ ధర్మాన్ని అందరూ ముందుకు తీసుకెళ్లాలి

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

సనాతన ధర్మపరిరక్షణకు, వేద సంప్రదాయాలు కాపాడేందుకు, ప్రాచీన విలువలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కంకణ బద్దులు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలో లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి తో కలిసి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామివారి అనుగ్రహంతో ప్రజలు,గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినారు.ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు టోని,ఆలయ కమిటీ అధ్యక్షుడు



మచ్చ శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరసింగం గౌడ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,ఆలయ కమిటీ సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,భక్తులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఆదర్శ క్లబ్ భవనాన్ని ప్రారంభించిన విప్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆదర్శ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చెర్మెన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మెన్ స్వరూప, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, మీరలా శ్రీనివాస్ యాదవ్,చుక్క రాజశేఖర్, భరత్, ప్రశాంత్, ఆదర్శ క్లబ్ సభ్యులు మొర శ్రీకాంత్,టోనీ,బత్తిని మల్లేశం, గణేష్,మ్యాన నాగరాజు, పర్శరాములు, అసాని లక్ష్మణ్, రమేష్, అశోక్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గనికి సత్కారం



**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఇటీవల ఏకగ్రీవంగా నియామకం ఏర్పాటు జరిగినందున బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోల్లి రామ్మోహన్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించారు. అనంతరం బొల్లి రామ్మోహన్ కార్యవర్గానికి సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొర శ్రీకాంత్, ఉపాధ్యాక్షులు దుబ్బాక రాజు, ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజశేఖర్, లీగల్ అడ్వైజర్ (సాక్షి )వెంగళ శ్రీనివాస్ కోశాధికారి గాధగోని సాగర్,సహాయ కార్యదర్శి గ్యాదనవేణి మధు, సంస్కృతిక కార్యదర్శి రెడ్డిమల్ల దేవరాజు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడే హక్కు లేదు



- **కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్**

**బలగం టీవీ ,హైదరాబాద్**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్బీఆర్ అంబేద్కర స్ఫూర్తితో బీజేపీ పార్టీ ముందుకు కెళ్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ స్టేట్ ఆఫీస్ లో వాజ్పేయీ శతజయంతి వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి ఆయన పా ల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం కోసం మాట్లాడటం దారుణ మన్నారు. అంబేద్కర్ కు అడుగడుగునా అవమానించిన కాంగ్రెస్ కు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. 1954 నుంచి 88 వరకు నెహ్రూ, ఇందిరగాంధీ సహా 21 మందికి భారత రత్న ఇచ్చారని, కానీ అంబేద్కర్ ను ఎందుకు విస్మరించిందో కాంగ్రెస్పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ, అబద్దాలల్లో కాంగ్రెస్ పార్టీకి అస్కార్ అవార్డు ఇవ్వొచ్చని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ అని అన్నారు. అబద్ధాలతో ముందుకు వెళ్తున్న పార్టీ కాంగ్రెస్ అంటూ విమర్శించారు. దేశ ప్రజల స్పూర్తి ప్రదాత వాజ్ పేయీ అని అంటూ . భారత దేశ వైభవాన్ని, నైతిక విలు వలకు ప్రపంచానికి చాటి చెప్పారన్నారు.. ఆయన ఎప్పుడూ పదవులకు ఆశపడకుండా నిస్వార్థంగా పని చేశారని ప్రశంసించారు.. ఒక్క ఓటుతో అధికారం కో ల్పోయినా ప్రజాతీర్పు కోరి మళ్లీ అధికారంలోకి వచ్చారన్నారు..ప్రధాని . మోదీ ఆయన ఆశయాలను తూచ తప్పకుండా అమలు చేస్తుంది' అని బండి సంజయ్ అన్నారు.



## బీఆర్ఎస్ నియంత పాలనలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి

- **సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్‌రెడ్డి**

**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

కాంగ్రెస్ హయాంలో పేదల కోసం ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేసిందని, నిరుపేదల జీవన ఉపాధి కోరకు భూపట్టాలు పంపిణీ చేసిందని సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి తెలిపారు. బి ఆర్ ఎస్ నాయకులు తమ వ్యక్తిగత స్వలాభం కొరకు దళారితనం చేశారని గత పది సంవత్సరాల బి ఆర్ఎస్ కాలంలో చట్టాలను తమ చట్టాలుగా మార్చుకొని ప్రభుత్వ భూములను తమ అధీనంలోకి మార్చుకున్నారన్నారు. మండలంలో దాదాపు 30 ఎకరాల భూమి ఉంటే ఇంటిగ్రేటెడ్ పాఠశాల మన మండలానికి వచ్చేదని పేదల భూములను రాబందుల్లా కబ్జాలు చేశారని ఆరోపించారు. మండలంలోని పలు గ్రామాలలో బి ఆర్ఎస్ నాయకులు పదవులు,అధికారం ఉందనే పెత్తనంతో గ్రామాలలో నియంతల వ్యవహరించి పేదల భూములు సైతం కబ్జాలు చేశారని ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతూ గ్రామాలలో దొరల పెత్తనం కొనసాగించారని లావాని పట్టాలు, చెరువు శిఖం భూములు,ప్రభుత్వ భూములు కబ్జాలకు గురయ్యాయని వీటిని త్వరలోనే సమగ్ర సర్వే చేయించి చర్యలు చేపడతామన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ..

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో మండల ఆంధ్రప్రభ రిపోర్టర్ రెడ్డి రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి చేతుల మీదుగా ఆంధ్రప్రభ 2025 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా దినపత్రికలు పనిచేస్తున్నాయని, ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు ప్రభుత్వ దృష్టి వైపు తీసుకెళ్తుందని అన్నారు.

## 28న మాదాపూర్‌లో మెగా జాబ్ మేళా

**బలగం టీవీ ,హైదరాబాద్**

మాదాపూర్‌లోని శ్రీ సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో డిసెంబర్ 28వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జాబ్ మేళా నిర్వాహకులు మన్నన్ ఖాన్ ఇంజినీర్ వెల్లడించారు. ఫార్మా, హెల్త్, ఐటీ, ఎడ్యుకేషన్, బ్యాంక్స్‌తో పాటు ఇతర రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరు కావొచ్చు. కొన్ని కంపెనీలు వర్క్ ఫ్రం హెూం ఆప్షన్‌ను కూడా అందిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా పదో తరగతి పాసై ఉండాలి. ఇంటర్వ్యూల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. తదితర వివరాల కోసం 8374315052 నంబర్‌ను సంప్రదించొచ్చు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పోలీసుల నోటీసులు

**బలగం టీవీ ,హైదరాబాద్**



హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి మసాబ్‌ట్యాంక్ పోలీసులు నోటిసులు జారీ చేశారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యేపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కౌశిక్ రెడ్డితో పాటు 20 మంది అనుచరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ఈ నెల 4న సీఎం రేవంత్ రెడ్డి, ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్ టాప్ చేస్తున్నారంటూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన సమయంలో సీఐతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. తన ఫిర్యాదును తీసుకున్న తర్వాతనే వెళ్లాలని గొడవ చేశారు. అనంతరం బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 27న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు.

# నేటి నుంచి బాక్సింగ్ డే టెస్టు



**బలగం టీవీ, మెల్‌బోర్న్**

టీమిండియా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ రసవత్తరంగా మారింది. ఇప్పటికే ఆతిథ్య ఆస్ట్రేలియా, పర్యాటక టీమిండియా చెరో మ్యాచ్ గెలవగా ఇంకోమ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ క్రమంలో మెల్ బోర్న్ లో జరిగే నాలుగో టెస్ట్ కీలకంగా మారింది. ఈ బాక్సింగ్ డే టెస్టులో విజయంపై ఇరుజట్లు కన్నేసాయి. మెల్బ్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే మ్యాచ్‌లో నెగ్గి.. సిరీస్‌లో పైచేయి సాధించాలని ఇరుజట్లు భావిస్తున్నాయి.

నాలుగో టెస్ట్‌కు మెల్‌బోర్న్ గ్రౌండ్ పిచ్ విషయానికి వస్తే.. పిచ్‌పై గడ్డి బాగానే ఉంది. కొత్త బంతితో బౌలర్లు చూపే అవకాశం ఉంటుంది. అదనపు బౌన్స్‌తో పాటు సీమ్‌ను రాబట్టొచ్చు. బ్యాటర్లు కుదురుకుంటే మాత్రం భారీగా పరుగులు తీయొచ్చు. టాస్ కీలకంగా మారే అవకాశం ఉంటుందని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. ఎంసీజీ టెస్టుల్లో సగటు మొదటి ఇన్నింగ్స్ స్కోరు 307. తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు ఇప్పటి వరకు 117 మ్యాచుల్లో 57 సార్లు గెలిచాయి. టీమిండియా మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఎంసీజీలో మంచి రికార్డు ఉంది. ఇక్కడ ఆడిన రెండుటెస్టుల్లో 15 వికెట్లు పడగొట్టాడు.

**ఆస్ట్రేలియా టీమ్‌లో మార్పులు..**

బాక్సింగ్ టెస్టుకు క్రికెట్ ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. మెల్‌బోర్న్‌లో జరగనున్న ఈ బాక్సింగ్ డే టెస్టు కోసం ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ జట్టును వెల్లడించాడు. మ్యాచ్‌కు ముందు జరిగిన మీడియా సమావేశంలో కెప్టెన్ పాల్గొన్నాడు. మ్యాచ్‌కు ట్రావిస్ హెడ్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నట్లు తెలిపాడు. ఎంసీజీలో మెరుగైన రికార్డు ఉన్న స్కాట్ బోలాండ్‌కు సైతం తుదిజట్టులో చోటు దక్కింది. మెల్‌బోర్న్‌లో జరగనున్న టెస్టు కోసం ఆస్ట్రేలియా రెండు మార్పులు చేసినట్లు పాట్ కమిన్స్ తెలిపాడు.

నాథన్ మెక్‌స్వీనీ స్థానంలో శామ్ కాన్‌స్టాస్‌కు చోటు దక్కింది. ఎంసీజీలో శామ్ కాన్‌స్టాస్‌కి టెస్టుల్లోకి అరంగేట్రం చేయబోతున్నాడు. గాయంతో సిరీస్‌కు దూరమైన జోష్ హేజిల్‌వుడ్ స్థానంలో బోలాండ్‌కు చోటు కల్పించినట్లు పాట్ కమిన్స్ పేర్కొన్నాడు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ తర్వాత టెస్టు క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కుడైన ఆస్ట్రేలియన్ ప్లేయర్‌గా శామ్ కాన్‌స్టాస్ నిలిచాడు. కమిన్స్ తన 18వ ఏట 2011లో తన టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 19 ఏళ్ల వయసులో కాన్‌స్టాస్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు.

**భారత జట్టు (అంచనా)**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీశ్ రెడ్డి, రవీంద్ర జడేజా, ఆకాశ్ దీప్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.

**ఆస్ట్రేలియా జట్టు**

ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టాస్, మార్నస్ లాబుస్‌చగ్నే, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, అలెక్స్ కారీ (వికెట్ కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లియోన్, స్కాట్ బోలాండ్.

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బూమ్రా జోరు




**బలగం టీవీ, హైదరాబాద్**

టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మరోసారి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన జోరు చూపిస్తున్నాడు. ఇప్పటికే అగ్రస్థానంలో ఉన్న ఈయన, గబ్బా టెస్టులో తొమ్మిది వికెట్లు పడగొట్టి తన స్థానాన్ని ఈ సారి మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఈ వారం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 904 రేటింగ్ పాయింట్లతో బుమ్రా టాప్‌లో కొనసాగుతున్నాడు. అంతేకాకుండా టెస్టుల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన టీమ్ఇండియా బౌలర్‌గా అశ్విన్ రికార్డును ఇప్పుడు బుమ్రా సమం చేశాడు. అయితే ఇటీవల రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్ 2016 డిసెంబరులో ఈ ఘనత సాధించాడు. ఇక బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా నాలుగు స్థానాలకు దిగజారి 10వ ర్యాంక్‌కు పడిపోయాడు.

ఇక బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే ఇంగ్లాండ్ బ్యాటర్లు 895 పాయింట్లతో జో రూట్ టాప్‌లో ఉండగా, 876 పాయింట్లతో హ్యారీ బ్రూక్ రెండు స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 867 రేటింగ్ పాయింట్స్‌తో కేన్ విలియమ్సన్ మూడో స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ 825 పాయింట్లతో ఒక స్థానం ఎగబాకి నాలుగో ర్యాంకుకు చేరుకున్నాడు.

మరోవైపు 805 పాయింట్లతో యంగ్ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఒక స్థానం కిందకు దిగి ఐదో ర్యాంక్‌కు చేరగా, స్టార్ క్రికెటర్ రిషభ్ పంత్ 708 పాయింట్లతో రెండు స్థానాలు దిగజారి 11వ ర్యాంక్‌కు పరిమితమయ్యాడు. అయితే మరో యంగ్ క్రికెటర్ శుభ్‌మన్ గిల్ మాత్రం 652 పాయింట్లతో నాలుగు స్థానాలు పడిపోయి 20వ ర్యాంక్?ను చేజిక్కించుకున్నాడు. ఇక విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి 21వ ర్యాంక్‌ను కైవసం చేసుకున్నాడు. ఇక టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఐదు స్థానాలకు దిగజారి 35వ స్థానానికి పరిమితమయ్యాడు.

# రెట్రో టైటిల్ టీజర్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజుదర్శకత్వంలో కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం సూర్య 44 చిత్రానికి రెట్రో టైటిల్‌ను ఫిక్స్ చేశారు. అలాగే రెట్రో టైటిల్ టీజర్‌ను బుధవారం విడుదల చేశారు. హీరోహీరోయిన్లు ఇద్దరూ ఓ ఆలయం మెట్లపై కూర్చుని ఉండగా.. సూర్యకు తాయిత్తు కడుతోంది పూజాహెగ్డే. ఇది (తాయిత్తు)నా కోపాన్ని కంట్రోల్ చేస్తే.. నా తండ్రితో కలిసి పనిచేయడం ఆపేస్తా.. హింస, రౌడీయిజం లాంటి వాటిని ఈ క్షణం నుంచి వదిలిపెడతానంటున్నాడు సూర్య. ఇంతకీ సూర్య ఎమోషన్స్‌ను ఆ తాయిత్తు కంట్రోల్ చేస్తుందా.. ?అనేది సస్పెన్స్‌లో పెడుతూ కట్ చేసిన టీజర్ సూర్యను పూర్తిగా మాస్ అవతార్‌లో చూపించబోతున్నట్టు తెలుస్తోంది. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. సూర్య హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మిస్తున్న ఈ మూవీలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ బ్యాక్ డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీకి తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా వర్క్ చేస్తున్నాడు.

## 'మా' సభ్యులకు అధ్యక్షుడు మంచు విష్ణు కీలక సూచనలు

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సభ్యులకు అధ్యక్షుడు, సినీ నటుడు మంచు విష్ణు కీలక సూచనలు చేశారు. సున్నితమైన విషయాలపై ఎవరూ స్పందించకపోవడం మంచిదని అన్నారు. ప్రభుత్వాల మద్దతుతోనే చిత్ర పరిశ్రమ ఎదిగిందని విష్ణు తెలిపారు. మన కళాకారులు ఎల్లప్పుడూ అన్ని ప్రభుత్వాల ప్రజాప్రతినిధులతో అనుబంధం, సాన్నిహిత్య సంబంధాలు కలిగి ఉంటారని తెలిపారు. గతంలో వివిధ ప్రభుత్వాల మద్దతుతోనే చిత్ర పరిశ్రమ ఎంతో ఎగిందని చెప్పారు. హైదరాబాద్‌లో తెలుగు సినీ పరిశ్రమ స్థిరపడటానికి అప్పటి సీఎం చెన్నారెడ్డి అందించిన ప్రోత్సాహం అత్యంత ముఖ్యమైనదని అన్నారు. ఈ విధంగా, ప్రతి ప్రభుత్వంతో మన పరిశ్రమకు ఎల్లప్పుడూ సత్సంబంధాలు కొనసాగుతూ వస్తున్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, సభ్యులందరూ సున్నితమైన విషయాలపై వ్యక్తిగత అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించవద్దని మా సభ్యులను మంచు విష్ణు విజ్ఞప్తి చేశారు. వివాదాస్పద అంశాల్లో పక్షాలు తీసుకోవద్దని సూచించారు. కొన్ని సమస్యలు వ్యక్తిగతమైనవని, మరికొన్ని విషాదకరమైనవని చెప్పారు. వాటిపై చట్టం తన దారిలో తను న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. అలాంటి అంశాలపై మాట్లాడటం వల్ల అది సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, సంబంధిత వ్యక్తులకు మరింత నష్టం కలిగించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమయంలో మనకు సహనం, సానుభూతి, ఐకమత్యం అవసరమని అన్నారు. తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఓ పెద్ద కుటుంబమనే సంగతి గుర్తుంచుకుందామన్నారు. ఏ సమస్యలు వచ్చినా, మనమంతా కలిసి ఎదుర్కొందామని చెప్పారు.

## సినీ రచయిత చిన్ని కృష్ణ ఇంట విషాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



సినీ రచయిత చిన్ని కృష్ణ ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి సుశీల కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె... ఈ తెల్లవారుజామున తెనాలిలో మృతి చెందారు. ఈ సాయంత్రం ఆమె అంత్యక్రియలు తెనాలిలో జరగనున్నాయి. సుశీల మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం ప్రకటిస్తున్నారు. చిన్ని కృష్ణకు అమ్మ అంటే ఎంతో అభిమానం. అమ్మ గొప్పతనాన్ని తెలుపుతూ ఆయన ఎన్నో కవితలు రాశారు. జన్మ జన్మలకు నీకే జన్మించాలని ఉందమ్మా అంటూ మాతృదినోత్సవం రోజు భావోద్వేగంతో కూడిన వీడియోను షేర్ చేశారు.

## క్రిస్మస్ తాత గెటప్‌లో నితిన్..

**బలగం టీవీ, హైదరాబాద్**




వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ . మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రం నుంచి బుధవారం లుక్ ఒకటి మేకర్స్ విడుదల చేశారు. ఈ లుక్‌లో శాంటా లుక్‌లో ఉన్న నితిన్ ఓ చిన్నారికి క్రిస్మస్ కానుకను అందిస్తున్నాడు. ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. అనివార్య కారణాల వల్ల రాబిన్ హుడ్ డిసెంబర్ 25న విడుదల కావడం లేదు. కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీలో నటకిరిటీ రాజేంద్రప్రసాద్ ఏజెంట్ జాన్ స్నో పాత్రలో కనిపించబోతున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## డాకు మహారాజ్ న్యూ పోస్టర్..

**బలగం టీవీ, హైదరాబాద్**




బాబి దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న చిత్రం డాకు మహాం జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. కాగా మేకర్స్ క్రిస్మస్ కానుకగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ సినిమాలోని లీడ్ క్యారెక్టర్లను పరిచయం చేశారు. బాలకృష్ణ ఓ వైపు గండ్రగొడ్డలి చేతబట్టి కనిపిస్తుండగా.. మరోవైపు ఊర్వశి రౌటేలా పిస్తోల్ పట్టుకుంది.